క్లుప్తంగా

ఎస్పీకి వినతి

రామగిరి(నల్లగొండ): రంజాన్ మాసం సందర్భంగా నల్లగొండ పట్టణంలో 24 గంటలు హోటళ్లు, చిరు దుకాణాలు నడుపుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ శాంతి కమిటీ సభ్యులు బుధవారం ఎస్పీ చందనాదీప్తికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శాంతి కమిటీ సభ్యులు షరీఫ్, ఇస్మాయిల్ ఖాన్, జునైద్ హష్మీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుల నియామకం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంపాటు నల్లగొండ, కనగల్ మండలాల అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా కంకణాల నాగిరెడ్డి, నల్లగొండ మండల అధ్యక్షుడిగా బోగరి అనిల్‌కుమార్, కనగల్ మండల అధ్యక్షుడిగా పల్లె ప్రకాశ్‌ను నియమించారు. అదేవిధంగా బీజేపీ మీడియా సెల్ జిల్లా కన్వీనర్‌గా గద్దం మహేష్‌ను నియమించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

మునుగోడు: బీఎస్పీతో బీఆర్‌ఎస్ పార్టీ పొత్తు పెట్టుకోవడాన్ని నిరసిస్తూ తాము బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పందుల సురేష్, పందుల హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయారని ఆరోపించారు.

దరఖాస్తుల స్వీకరణ

మర్రిగూడ : గృహజ్యోతి పథకం అందనివారు ఈ నెల 5 నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. బుధవారం వరకు 351 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. 242 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు సూపరింటెండెంట్ యాకుబ్‌అలీ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పార్వతి, రజిత, విజయ్, రమేష్, సిబ్బంది ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

రఘువీర్ ప్రతాప్‌కు పురస్కారం



నల్లగొండ రూరల్: జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కవి, రచయిత ఎన్‌వి.రఘువీర్ ప్రతాప్‌కు ఈ నెల 20న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం అందించనుంది. రఘువీర్ ప్రతాప్‌కు కీర్తి పురస్కారం ప్రకటించడంపై సిలువేరు సాహితి సేవా కళాపీఠం బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపింది.

సభ్యత్వం అందజేత

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని జి.చెన్నారం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కూలీలకు సంఘం సభ్యత్వాలు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, మండల అధ్యక్షుడు అంజయ్య, యాదయ్య, సత్తయ్య, శోభారాణి, గోవిందమ్మ, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

నల్లగొండటూటౌన్: ఆదర్శ వివాహాలను ప్రోత్సహించి అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో కులాంతర వివాహ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మునుగోడుకు చెందిన భీంప్రసాద్, చిట్యాలకు చెందిన జ్యోతికి ఆదర్శ వివాహం చేశారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ నూతన జంట భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పందుల సైదులు, ఇందూరి సాగర్, బొడ్డు కిరణ్, శ్రీనివాస్, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కంబాలపల్లి మహేందర్



నియామక పత్రం అందజేస్తున్న మోహన్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కంబాలపల్లి మహేందర్ నియమితులయ్యాడు. బుధవారం మహేందర్‌కు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు సాయిరాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసానికి సన్నద్ధం !

మర్రిగూడ: గతంలో మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి పూనుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నాడు అవిశ్వాసం నిలిచిపోయింది. ఇటీవల అవిశ్వాసానికి హైకోర్టు అనుమతి ఇవ్వడంతో తిరిగి అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నట్టు తెలిసింది. అవిశ్వాసం ఏర్పడితే తిరగండ్లపల్లి ఎంపీటీసీ గండికోట రాజమణి హరికృష్ణను ఎంపీపీగా ఎన్నుకోవాలని ఎంపీటీసీలు నిర్ణయించుకున్న విషయం విదితమే. ప్రస్తుతం హైకోర్టు ఆదేశానుసారం అవిశ్వాసానికి ఎంపీటీసీలమంతా సిద్ధమేనని దామెర భీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వసూళ్లు సరే.. ఖాతాలో జమ చేయరేం !

- గ్రామస్తుల నుంచి ఎప్పటికప్పుడు ఇంటి పన్ను వసూలు
- ఆర్థిక సంవత్సరం చివరలో గ్రామ పంచాయతీ ఖాతాలో జమ
- నిర్లక్ష్యం వహిస్తున్న కొందరు కార్యదర్శులు
- సకాలంలో వేతనాలు అందక సిబ్బంది అవస్థలు



మునుగోడు: గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వ నుంచి రావాల్సిన నిధులు నాలుగైదు నెలలకోమారు వస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందించేందుకు పాలకవర్గ సభ్యులు నానా ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఇంటి, నల్లా పన్నులతోపాటు ఇతర ఆదాయాలను ఎప్పటికప్పుడు వసూలు చేసి గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేసి తిరిగి ఆ నగదును గ్రామ పంచాయతీ నిర్వహణకు, వేతనాలకు వినియోగించుకోవాలని జిల్లా స్థాయి అధికారులు సూచించారు. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తుల నుంచి వసూలు చేసి ఇంటి పన్నులు ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేయకుండా తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకుని ప్రతి సంవత్సరం మార్చి మాసంలో ఏడాది డబ్బులు ఒకేసారి జమచేస్తున్నారు.

కోతులారం గ్రామంలో..

మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో మొత్తం 204 ఇళ్లల్లో 840 మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఇళ్ల యజమానులంతా క్రమం తప్పకుండా ఇంటి పన్ను కడితే ఏడాదికి రూ.లక్షా 4 వేల ఆదాయం వస్తుంది. కోతులారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్ను వసూలు చేస్తున్నాడు. కానీ ఆ నగదును వెంటనే జమచేయకుండా మార్చి మాసంలో పంచాయతీ ఖాతాలో జమ చేస్తున్నాడు. 2023 మార్చి 29న రూ.లక్షా 28,888 జమచేసిన కార్యదర్శి.. తిరిగి ఏప్రిల్ నెల నుంచి ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు చేశాడు. 2024 జనవరి వరకు దాదాపు రూ. 80వేల ఇంటి పన్నులు వసూలు చేశాడు. కానీ ఆ నగదును పంచాయతీ ఖాతాలో జమచేయలేదు. ఇలా మండలంలోని పలువురు కార్యదర్శులు ఆలస్యంగా నగదు పంచాయతీ ఖాతాలో జమచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రామస్తులు నిలదీయడంతో..

గ్రామ పంచాయతీకి ఆరు నెలలుగా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. దీంతో ఆ సిబ్బంది తమకు వేతనాలు ఇవ్వడం లేదని, పనులు మానేస్తామని గ్రామస్తులకు మొరపెట్టుకున్నారు. గ్రామస్తులంతా పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్లి వసూలు చేసిన ఇంటి పన్నులతో సిబ్బంది వేతనాలు ఇవ్వొచ్చు కదా అని నిలదీశారు. దీంతో కార్యదర్శి ఈ నెల 12వ తేదీన తన వద్ద ఉన్న నగదు పంచాయతీ ఖాతాలో జమచేశాడు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పంచాయతీ కార్యదర్శులు వసూలు చేసిన పన్నులను ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీల ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బంది పెట్టి పన్ను వసూలు చేశాడు



మా అమ్మ మరణిస్తే మరణ ధృవీకరణ పత్రం కోసం పంచాయతీ కార్యదర్శి దగ్గరకు వెళ్లాం. మేము స్థానికంగా నివాసం ఉండకపోవడంతో ఇంటి పన్నులు ప్రతి ఏడాది కట్టలేకపోయాం. మా తల్లి చనిపోయిన బాధలో ఉన్నామని కూడా ఆలోచించకుండా ఇంటి పన్ను కడితేనే మరణ ధృవీకరణ పత్రం ఇస్తానని ఇబ్బంది పెట్టి పన్ను వసూలు చేశాడు. జనవరి మాసంలో రూ. 6040 చెల్లించాం. కానీ ఆ నగదు గ్రామ పంచాయతీ ఖాతాలో జమచేయలేదని తెలిసింది.

–చెన్నోజు భిక్షం, కోతులారం

ఒకేసారి వేయొచ్చని జమచేయలేదు

ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నులు, ఇతర పన్నులు 2023 మార్చి 29వ తేదీన రూ.లక్షా 24 వేలు గ్రామ పంచాయతీ ఖాతాలో జమచేశా. తిరిగి ఏప్రిల్ మాసం నుంచి ఇప్పటి వరకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేశాం. మొత్తం నగదు ఒకేసారి వేయొచ్చని నా దగ్గరే పెట్టుకున్నా. గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉండగా ఈ నెల 12వ తేదీన నా దగ్గర ఉన్న రూ.లక్షా 2వేల నగదు పంచాయతీ ఖాతాలో జమచేశా.

– ప్రవీణ్ , కోతులారం గ్రామ పంచాయతీ కార్యదర్శి

వారం రోజుల్లోపే జమచేయాలి

పంచాయతీ కార్యదర్శులు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు వెంటవెంటనే గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేయాలి. ఒకవేళ సమయం లేకపోతే కనీసం వారం రోజుల్లోపు జమచేయాలి. అలా చేయకుండా నెలల తరబడి నగదు దగ్గర పెట్టుకుంటే చర్యలు తీసుకుంటాం. త్వరలో మండలంలోని గ్రామాల లెక్కలు చూసి ఎవరైనా ఇంటి పన్నులు పంచాయతీ ఖాతాలో జమచేయనివారు ఉంటే జమ చేయిస్తాం.

–కె.స్వరూపరాణి, మండల పంచాయతీ అధికారి

అభివృద్ధి పనులకు సహకరించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్: రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో స్టేట్ ప్లాన్ నిధులు నుంచి రూ.10 కోట్లతో మార్కెట్ రోడ్డు విస్తరణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నకిరేకల్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని, నకిరేకల్‌కు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం నుంచి కడపర్తి రోడ్డు బైపాస్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామని తెలిపారు. మూడు దశబ్దాలుగా ఈరోడ్డు అధ్వానంగా ఉండి రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈవిషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజురు చేయించామన్నారు. త్వరలో ఈ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా మారుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఏపీఎం విద్యా సంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, చౌగోని రజిత శ్రీనివాస్, గాజుల సుకన్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, యానాల లింగారెడ్డి, అశోక్‌రెడ్డి, లింగాల వెంకన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చిట్యాల:పెద్దకాపర్తి గ్రామంలో గల శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ కల్యాణోత్సవాల ప్రచార పోస్టర్‌ను బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఓర్సు రాజ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్ కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, నూతి వెంకటేశం, నీలకంఠం నరేష్, గంట్ల రవీందర్‌రెడ్డి, నీలకంఠం లింగస్వామి, ఏదుళ్ళ అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

కనగల్ : దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ హుండీని బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఐదు నెలలకు గాను రూ.23,16,959 ఆదాయం సమకూరిందని ఎండోమెంట్ సహాయ కమిషనర్ కె.మహేందర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య, చైర్మన్ అలుగుబెల్లి నరసింహారెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, బ్యాంకు మేనేజర్ వెంకటయ్య, ఎంపీటీసీ శైలజ సైదులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పశువుల సంత వేలం

కట్టంగూర్ : కట్టంగూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి బుధవారం ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ సన్ని అబ్రహం ఆధ్వర్యంలో పశువుల సంత వేలం పాట నిర్వహించారు. కట్టంగూర్‌కు చెందిన చెరుకు లింగయ్య పశువుల సంతను రూ.31.55 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ తెలిపారు. జీపీ సిబ్బంది చిత్తలూరి జానకిరాములు, కానుగు వెంకన్న, కాపుగంటి శ్రీను, యర్కల సత్తయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



మర్రిగూడ : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ యశోద

మర్రిగూడ: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ముమ్మడి యశోద, మిర్యాల పద్మ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చిరుధాన్యాల ఆహారం అందించినట్లయితే శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయన్నారు. అనంతరం రాగి జావ, రొట్టెలను తయారు చేసి బాలింతలకు, గర్భిణులకు అందించారు. అంగన్‌వాడీ టీచర్లు బి.శోభారాణి, జయమ్మ, మంగమ్మ, సౌజన్య, రజిత, ఆయాలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ

చిట్యాల: వెలిమినేడు, ఉరుమడ్ల, వట్టిమర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, యువతులకు చిరుధాన్యాల్లోని పోషకాహార విలువలపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా, అంగన్‌వాడీ టీచర్‌లు ఎం.అండాలు, పి.పద్మ, వి.సునిత, యూ.ధనలక్ష్మీ, పి.అంజమ్మ, జి.లలిత, జి.ధనమ్మ, ఏ.ఇందిర, బి.అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబకు నివాళి



చిట్యాల: చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మర సంఘం ప్రతినిధులు

చిట్యాల: తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని చిట్యాలలో శ్రీ భవాని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, అధ్యక్షుడు ఖమ్మంపాటి నర్సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారులు అర్రూరి సత్తయ్య, అర్రూరి శ్రీనివాస్, కోశాధికారి ఖమ్మంపాటి నర్సింహ, ముఖ్య సలహాదారుడు ఉట్కూరు బాలకృష్ణ, అర్రూరి భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నార్కట్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.భిక్షపతి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, రమేష్, దేవయ్య, శ్రీనివాస్, మల్లేష్, జానకిరాములు, సత్యనారాయణ, భిక్షం, శ్రీహరి, వెంకటయ్య, వీరస్వామి తదితరులున్నారు.

ఉత్తమ మున్సిపాలిటీగా నల్లగొండను తీర్చిదిద్దుతా

- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మోటార్లను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ఉత్తమ మున్సిపాలిటీగా నల్లగొండను తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ బైపాస్ రోడ్ వద్ద రూ.55 కోట్ల నిధులతో విలీన గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఎన్జీ కాలేజీ వద్ద కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న హెల్త్ అండ్ హైజిన్ స్ట్రీట్ ఫుడ్‌కోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రూ.600 కోట్ల నిధులతో చేపట్టనున్న అవుటర్ రింగ్ రోడ్డు పనులకు వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నామన్నారు. ఆరు లైన్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి, రహదారి పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా 10లక్షల లీటర్లు, 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 2 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాకు 12,000 మంది హాజరుకాగా 6000 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. మే, జూన్‌లలో మరో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం నీటిని సరఫరా చేయాలి

ప్రజలందరికీ సక్రమంగా ప్రణాళిక ప్రకారం తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నల్లగొండ సమీపంలోని పానగల్‌లో ఉన్న 19.6 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. వాటర్ ట్రీట్మెంట్ పనులు, తాగునీటి సరఫరా, పానగల్ నీటి శుద్ధి కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి కెపాసిటీని పరిశీలించారు. మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ప్రజారోగ్య శాఖ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జి.ఎడవల్లి, తేలకంటిగూడెం నీటి శుద్ధి కేంద్రాలను పునరుద్ధరించి వాటి ద్వారా తాగునీటిని గ్రామాలతోపాటు, చండూరు మున్సిపాలిటీకి సరఫరా చేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర తాగునీటి సరఫరా ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డిని ఫోన్ ద్వారా ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ఆర్డీఓ రవికుమార్, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగ జేఏసీ జిల్లా క్యాలెండర్‌ను బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాదెపాక లింగయ్య, జిల్లా అధ్యక్షుడు యానాల శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాలి మురళి, కోశాధికారి కళ్యాణి, ఉపాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జూకూరి రమేష్

నల్లగొండ: నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జూకూరి రమేష్ బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి, సభ్యులు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, తంగెళ్ల యాదగిరిరెడ్డి, గంటెకంపు సైదులు, జానయ్య, సైదిరెడ్డి, పులకరం సుజాత, షేక్ కరీముల్లా, మెగావతు శ్రీను బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాశం సంపత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక కార్యదర్శి నాగేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాసగౌడ్, వల్లె జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని విజయ గణపతి, సరస్వతీ, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అభయాంజనేయ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయ చైర్మన్ పాదూరి మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కూతురు లక్ష్మారెడ్డి, బ్రహ్మనందరెడ్డి, సురిగి మారయ్య, జెల్ల శ్రీశైలం, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వంగాల నరేందర్‌రెడ్డి, సురెడ్డి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

శాలిగౌరారం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని లయన్స్‌క్లబ్ యూత్ చైర్‌పర్సన్, మోటివేటర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేక అధికారి ఉమారాణి, జిల్లా లయన్స్ క్లబ్ హంగర్ రిలీఫ్ చైర్‌పర్సన్ కెవి ప్రసాద్, మండడి నర్సిరెడ్డి, క్లబ్ ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు, బచ్చు ఆంజనేయులు, వెంకన్న, రామ్మూర్తి పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

కట్టంగూర్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎంఈఓ మేక నాగయ్య అన్నారు. బుధవారం ముత్యాలమ్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కట్టంగూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు జీఎంఆర్ సంస్థ, వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి అంజయ్య, మల్లికార్జున్, ఉపాధ్యాయులు కూరెళ్ల భవాని, మూడుదుడ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సుంకరబోయిన వెంకన్న, హరిందర్ పాల్గొన్నారు.

హోటల్ యజమానికి సన్మానం

చిట్యాల: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్‌గుప్తా అన్నారు. చిట్యాలలో శ్రీ కనకదుర్గా టిఫిన్ సెంటర్‌లో అరిటాకులతో టిఫిన్స్ అందిస్తున్నందుకుగాను బుధవారం టిఫిన్ సెంటర్ యజమాని బొడ్డుపల్లి లింగయ్యను సురేష్‌గుప్తా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు.

అల్పాహారం అందజేత

మర్రిగూడ: మండల కేంద్రంలోని హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు పంపించిన అల్పాహారాన్ని గ్రామానికి చెందిన పంతంగి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం అందజేశారు. ప్రతిరోజు అల్పాహారం అందిస్తామని ఇచ్చిన మాట ప్రకారం అంజన్‌రావు బుధవారం విద్యార్థులకు అల్పాహారం అందించడంపై విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు నీరుడు అంజయ్య, ఉపాధ్యాయులు తదితనేలే పాల్గొన్నారు.

కొనసాగిన పాదయాత్ర

శాలిగౌరారం: చట్ట సభల్లో బీసీలకు రాజ్యాంగబద్ధమైన వాటా సాధించేందుకు సబ్బండ కులాలు ఏకం కావాలని అఖిల భారత ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఊట్కూరు గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

కేతేపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యానాల నర్సిరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేస్తా



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అన్నారు. బీజేవైఎం (బీజేపీ యువమోర్చా) జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల వైఎస్సార్ సర్కిల్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, ఇతర ముఖ్య నాయకుల సమక్షంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా వంగూరి రాఖీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, అధికార ప్రతినిధి పెరిక మునికుమార్, వెంకటేశ్వర్లు, బాలాజీ, హరీశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



శాలిగౌరారం జెఎంజె పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

శాలిగౌరారం: మండలకేంద్రంలోని జెఎంజె ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా విద్యార్థులు అలరించారు. ఎంఈఓ నాగయ్య, ఎస్‌ఐ ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నల్లగొండటూటౌన్: ఆశా వర్కర్లు రెండు సంవత్సరాలుగా చేసిన లెప్రసీ సర్వే బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన డీఎంహెచ్‌ఓ కొండల్‌రావుకు ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఆశా వర్కర్లకు బిల్లులు విడుదల చేయకపోవడం సరైంది కాదన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలోని మాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య, ఉపాధ్యాయులు డి.సరోజినీదేవి, శ్రీనివాసు, ఖదీర్, కృష్ణమూర్తి, వెంకన్న, హమీద్, సంస్థ సభ్యులు లెనిన్, శ్రీకాంత్, ఎల్లాచారి, లింగస్వామి, అర్జున్, రాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆర్యవైశ్యులు బుధవారం స్థానిక ఎన్జీ కళాశాల ఎదుట సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. నాంపల్లి భాగ్య, యామ మురళి, నాంపల్లి నరసింహ, అర్థం శీను, బండారు వెంకటేశ్వర్లు, వందనపు వేణు, రేపాల భద్రాద్రి రాములు, పోరుగంటి పరమేశ, కాసం శేఖర్, తాళ్లపల్లి రాము, నూనె కిషోర్, కోటగిరి రామకృష్ణ, వనం గోపికృష్ణ, సుజాత. మిర్యాల రాధ, నవనీత, వెంకటయ్య, ఓం ప్రసాద్, బూరుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 2000–01 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన భాగ్యలక్ష్మీ భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆమెకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఆమెతో కలిసి చదువుకున్న స్నేహితులు ముందుకు వచ్చారు. వారు సేకరించిన రూ.30 వేలను బుధవారం భాగ్యలక్ష్మీ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దగ్గుల యాదగిరి, ఏళ్ళ శ్రీశైలం, పోకల అశోక్, మల్లేష్, లింగయ్య, భద్రయ్య, ఉష, కవిత పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు